
మనసులు
మారాలి
పి.వి.ఆర్.శివకుమార్



కథానాయకుడు మరణించాడు !....

అవును. తెలుగు తెరపై సాధారణంగా జరగని 'అకృత్యం' జరిగిపోయింది। హీరో తలపై బలమైన దేంతోనో మోది చంపే శారు విలన్ తాలూకు వ్యక్తులు. వర్షపు రాత్రి అది. లాంతరు స్తంభం డోముమీదుగా బొట్లుబొట్లుగా జారుతూ, దీపం వెలుగులో మిలమిల మెరుస్తున్న చినుకుల్ని 'క్లోజప్పు'లో చూపిస్తూ, 'ప్రకృతి కూడా ఈ విలయానికి విలపిస్తున్నదోహో ...' అని చాటి చెప్పాడు దర్శకుడు.

'చ్చొచ్చొచ్చొ....' 'ప్చ్..ప్చ్. ప్చ్..' 'అయ్యో....' లాటి పదజాలం కుంభ వృష్టిలా కురుస్తోంది ప్రేక్షకుల 'పెదాల' నుండి.

అంతకు ముందు నుంచీ గూడా కష్టాలనే సమ్మోహనాస్త్రాల ద్వారా ప్రేక్షక హృదయాల్ని దోచుకుంటూనే వున్నాడు రచయిత!

కన్నీళ్ళతో తడిసిపోయిన రుమాళ్ళని ఘట్టిగా పిండుకుని, మళ్ళీ నాటకం సాగిస్తున్నారు నా ముందు సీట్లలోని ప్రజలు.

నా ఖర్మ! సినిమాల్లో యిలాటి విషాద ఘట్టాలకి చలించి, కన్నీరు కార్చే సున్నిత హృదయం నాకు లేదు! పైగా ఆ సమయంలోనే మరోలాటి వూహలతో నవ్వొస్తుందిగూడా!

'ధన్'మని .... వానలో, బురదలో, యిప్పుడైతే కూలిపోయాడుగానీ. యిదే హీరో—నిజ జీవితంలో అయితే—కిటికీలోంచైనా సరే. వానజల్లు చూస్తే చాలు, జలుబు చేస్తుందని ఏర్‌కండిషన్డ్ రూములోకి పారిపోయి కూర్చోడూ? ఇతగాడు... ఎండకన్నెరుగని యీ సుకుమారుడు.... కార్మికుల కష్టాల్ని నటించి పారేయడమూ. ప్రేక్షకులంతా అదేదో నిజమేనన్నట్లు కన్నీళ్ళు కురిపించటమూనా! ...

ఫస్ట్లాసైన ఓ కోటి విసుర్దామని ప్రక్క సీట్లోకి చూశాను. చూసీ, చూడటంతోనే వులిక్కిపడ్డాను!

నా శ్రీమతి.... నా శ్రీమతి సైతం.... వెక్కుతోంది! కర్చీఫ్‌తో కన్నీళ్లు తుడుచుకుంటోంది!

నా మతి మతిలో లేదు.

మా యిద్దరికీ పెళ్ళై ఏడాది మాత్రమే అయింది ఆమె కాపురానికి వచ్చి ఆర్నెల్లే అయింది. యీ ఆర్నెల్లలోనూ గూడా. యింతలా 'ఏడ్పించే' తెలుగు సినిమా చూడటం యిదే మొదలు. అంచాతే, నా కామె గూడా యిలా 'లీనమై'(?)పోతుందని తెలీదు

ఇప్పుడేం చెయ్యాలో గూడా తెలీట లేదు. నా భార్య అలా కన్నీళ్లు తుడిచుకుంటుంటే, చూస్తూ మాత్రం కూర్చోలేక పోయాను. కొద్దిగా ఆమె మీదకు వంగి, మెల్లగా అన్నాను;

"లక్ష్మీ....ఏమిటిది మరీనూ? హీరో చచ్చిపోయాడనేనా యింత ఏడుపూనూ? ఛ ...ఛ....యిది సినిమా! అంతగా అయితే, మళ్ళీ సెకెండ్ షో కొచ్చి, వో పావుగంటసేపా హీరోని మళ్ళీ చూసి, వెళ్ళిపోదాం. అంతేగాని అలాగేడవకు....

అయినా, చదువుకున్నదానివి. నువ్వు గూడా యిలా అసహ్యంగా....''నా మాట పూర్తికానే లేదు, చురుక్కుమనేలా చూపింది శ్రీమతి నావైపు: ''మీ అంత హృదయస్థైర్యం లేదులెండి నాకు. అయినా. చదువుకున్నంత మాత్రాన హృదయం లేకుండా పోతుందా? జాలీ, దయా యివి లేకపోవటమూ వో గొప్పేనా?''

ఈ రెండు ముక్కలూ అనేసి, మళ్ళీ స్క్రీన్ వైపు తిరిగేసింది.

నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు

'సినిమాల్లో ఏడిస్తేనే హృదయమున్నట్లా? లేక, హృదయమున్నవాళ్ళంతా సినిమా హాల్లో ఏడ్చి తీరాలా?

తోటివాడు కష్టాల్లో వుంటే, కన్నీరు నింపటం స్పందించే హృదయ సహజం. కానీ, ఆ 'తెరవేలుపు' తోటివాడూ కాడు—నిజంగా కష్టాల్లోనూ లేడు ఇంకెందుకీ

**మనుష్యులు మారాలి! ఎలా?**
**సినిమాలు చూసి కన్నీరు కార్చినంతమాత్రాన ఒరిజినాలిటీ మారుతుందా? మూడు గంటలు లేదా ఆ రాత్రంతా మాత్రమే!**
**తెల్లవారితే మామూలే!!**

ఏడుపు? 'యీ జీవితమే మాయ ఏదీ నీది కాదు—నిజమూ కాదు' అని గీత చెబుతుంటే, తలలూపే వీళ్ళే, సినిమా అనేది కేవలం కల్పితమూ, క్షణికమూ అని తెల్సి, దానికోసం యింతలా దుఃఖిస్తున్నారంటే అది అజ్ఞానమా, లేక 'సునితత్వమా?' అది మనిషి బలహీనతకి చిహ్నమౌతుందిగానీ, సున్నిత మనస్తత్వానికి దర్పణమెలాగౌతుంది?'

నా ఆలోచనల్లో నేనుండగానే, సినిమా అయిపోయింది. జనగణమన వేశారు. జనమంతా దొంగలు తరుముతున్నట్లు పరుగులు మొదలుపెట్టారు. సరే, ఎలాగూ గేటో రష్‌గానే వుందికదా అని, ఆ గీతం నాలుగు చరణాలూ (? త్రిరంపుణ హోను మిగిలింది) వినేసి, బయటికి నడిచాము.

రిక్షాలో కూర్చున్నాం. ఇంకా గాంభీర్యం వదల్లేదు లక్ష్మిని. ఎలాగైనా, మాటల్లోకి దించాలని అన్నాను :

"అదేమిటి లక్ష్మీ, అంతలా ఏడ్చేశావ్ సినిమాలో?" ఒక్క క్షణం ఏం మాట్లాడలేదామె ఆ తర్వాత నెమ్మదిగా అంది:

"మీ కసలు బాధే అన్పించలేదా ఆ సినిమా చూస్తే!"

ఆమె కంఠంలో యింకా బరువు! తేలికపరుద్దామన్నట్లుగా అన్నాను: "బాధా? హా....హా....నవ్వొచ్చింది! యూఫోం బెడ్డుమీద శయనించే కథానాయకుడు, కాసు కోసమలా నేలకూలుతుంటే...."

"చాల్లే, ఆపండి, మీ దింత పాషాణ హృదయమని అనుకోలేదు, తోటిమనిషి కష్టాల్లో కరగని గుండె కూడా...."

"స్టాప్....స్టాప్, అది కేవలమూ సినిమా, అక్కడ నిజం కష్టాలు లేవు, కేవలం కల్పితం...."

''అంటేః కష్టాలకి నిజమూ, అబద్ధమూ కూడానా? మన జీవితాల్ని కథగా వ్రాసి మలిచిన సినిమా కల్పితమెలా అవుతుంది? సినిమాలో అయితేమాత్రం కష్టం కష్టం కాదా? అలాగైతే, మీ గీతాకారుడి ప్రకారం, జీవితమూ క్షణ భంగురమేగా! ఒకో కష్టం అనుభవిస్తున్న కొద్దీ ఒకో పాపం హరించి, పుణ్యానికి చేరువౌతున్నాం—అని సంతోషించొచ్చుగా? ఏడవట మెందుకు? ఎవరు చేసుకున్న 'కర్మ' వారనుభవిస్తుంటే విచారం దేనికి? అదీ క్షణికమేగా?

సినిమా చూస్తున్నంతసేపూ కథలో లీనంకావాలి గానీ, తెరకి చిల్లులెన్నున్నాయో, దానిపై బల్లులెన్నున్నాయో లెక్కపెట్టటం కాదండీ! పాత్ర ధారుల నటనా నైపుణ్యం గమనించాలిగానీ. నిజ జీవితాల జోలి మీ కెందుకు? ఎవరి లోసుగులు వారికుంటాయి. వాటిని విమర్శించే బదులు, ఆ కథనా చాతుర్యాన్నీ, నటనా వైదుష్యాన్నీ ప్రశంసించరాదూ?....''

చిన్నసైజు ఉపన్యాసమే యిచ్చింది శ్రీమతి అంతటి 'మూడ్' లోనూ గూడా!

అయినా సరే, ఎందుకో నా మనస్సంగీకరించలేదు. అందుకే, 'ఇకనించీ ప్రతి సినిమాలోనూ నీకు తోడుగా నేనూ "ఏడుస్తా". నీకు 'కంపెనీ' ఇస్తాను ప్రియతమా!' అని చెప్పలేక పోయాను


'ఏమో! నాకు మాత్రం సినిమాల్లో అంతగా లీనం కావటం నచ్చదు....'' అన్నాను మెల్లగానే.

''నాకు మాత్రం చాలా బాధనిపిస్తుందండీ అవన్నీ చూస్తుంటేః పాపం, ఎంత హీనమైన బ్రతుకులు వాళ్ళవి! కన్న బిడ్డలకి కూడు సైతం పెట్టలేక ఎంత విలవిల్లాడి పోయిందా తల్లి! ఎంత హేయంగా వున్నాయి ఆ గుడిశెలూ, ఆ వాతావరణమూ! పచ్చి బాలింతరాలి శయనంకూడా కటిక నేల మీదేకదా! ఎప్పటికి మారతాయి వాళ్ళ పరిస్థితులు? ఎవరుద్ధరించాలి వాళ్ళని?

ఈ పేద ప్రజలపరిస్థితుల్ని అవంతైనా సంస్కరించలేని ప్రభుత్వం పాతికేళ్లుగా సోషలిజం. సోషలిజమంటూ దేశాన్నేం ఉద్ధరిస్తున్నట్లు?''

'అమ్మో! ఆవేశప్పాలు ఎక్కువై. రాజకీయాలు గూడా మాటాడేస్తోందే శ్రీమతి, మందు పూటుగా కొట్టేసిన మానవోత్తముళ్ళా!' అనుకున్నాను.

'సినిమాలో చూసైతే, యింతగా కదిలిపోయిందిగానీ, నిజజీవితంలోనయితే ఆ గుడిశెల మధ్య కాలైనా పెట్టగలదా యీవిడ? ఆ హీరోయిన్ గ్లామరస్‌గా, ఫోటో జెనిగ్గా ఏడ్చింది కాబట్టి యీవిడ సానుభూతి చూరగొంది గానీ, అదే నిజ జీవితంలో, చిరిగిన చీరెలో, వడలిన దేహంతో, చెదరిన జుట్టూ, జిడ్డుకారే మొహమూ వేసుకుని రాగాలు పెడుతూ




ఏడ్చే యువతి 'జుగుప్స' తప్ప మరే భావాన్నయినా కల్గిస్తుందా ఈ 'సుకుమార హృదయానికి?'

కానీ, యివేవీ పైకి మాత్రం అనలేదు అదంత శ్రేయస్కరం కాదని తెలుసు గనక.

ఇంకా ఆమె ముఖం మాత్రంవిషాదం గానే వుంది. ఏదేనా మాట్లాడించకపోతే మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టే ప్రమాదంవుందని పించిం.ది సీరియస్‌గా ముఖం పెట్టి, ఎప్రిషియేటివ్ మానర్‌లో అన్నాను.

“నువ్వు ప్రతిసినిమాలోనూ ఇలానే కదిలిపోతూవుంటావా?”

“ఆఁ....” పరధ్యానం లోనుంచి వులిక్కిపడి అంది లక్ష్మి.

“ప్రతి సినిమాలోనూ అని కాదు. ఎక్కువగా కష్టాలున్న సినిమాలైతే, మన మనసు మరీ బాధచెందితే.... అబ్బ కన్నీళ్లు వచ్చేస్తాయి. 'దేవదాసు' చూసిం తర్వాత రెండ్రోజులు అన్నమే తినలేదు నేను. మనసునిండా బాధే! ఏపని చేయబోయినా, ఆ చివరి సీన్లోని దేవదాసు కళ్ళముందు

మెదిలేవాడు. ఎంత ఫీలయ్యానో! అమ్మ తిగతిట్టింది గూడానూ. అలాటి పాడు సిని మాలు చూడకపోతేనేం? అని. అలాగే చిరంజీవులూనూ ఇంకా, అడపడుచూ, రక్త సంబంధం, మొగనోమూ....''

ఇహవిలా వదిలేస్తే తెలుగులోని విషాద చిత్రాల లిస్టంతా ఏకరవుపెటేలా వుందనిపించి, గబుక్కున

''అంత సున్నితమైతే గూడా కష్టం కదూ?'' అన్నాను.

''ఏం చెయ్యమంటారు? ఎవరినైనా సరే కష్టాలు చూస్తే నా మనసు చలించి ద్రవించకుండా వుండదు.''

ఇక నేనేం మాట్లాడలేదు.

భోజనాల దగ్గర కూడా ఆమె తన 'విషాద చిత్రాల తాలూకు అనుభవాల్ని' ఏకరువు పెడ్తూనే వుంది.

నాకు చాలా బాధనిపించింది....యీ వెధవ సినిమాకి వెళ్ళామేమిటా? అని!మా మా రేజీ మొదటి వార్షికోత్సవం యివాళ! ఆనందంగా సినిమా చూద్దామని వెళ్ళి, ఈ 'ఏడపు' కొని తెచ్చుకొన్నామేమిటా అని పించింది. కానీ అదే ముక్క బయటి కంటే. యిందాక పాషాణ హృదయమైనా వుందని అంగీకరించినదల్లా,యిప్పుడసలు మనసే లేదనేయగల్దు! అందుకే ఊరు కున్నాను.

పక్క మీదికి చేరాం. మంచం మీద మరో వైపుకి తిరిగి పడుకుంది శ్రీమతి. గాంభీర్యం యింకా వొదిలినట్లు లేదు. ఎలా దాన్ని వొదార్చాలో నాకంతు పట్ట లేదు

నవ్విద్దామని గనక ఏదేనా జోక్ చేశానా, బూతులు తిట్టినా తిడుతుంది. పోనీ, ఆ సినిమా గురించి ఏవేనా సాను భూతి వాక్యాలు పలికానా, పందిర దొరి కిన లతలా ఆకథ చుట్టూ అల్లుకు పోయి. ఇహ యీ లోకానికి దిగిరాదు, రెండు విధాలా కష్టమే! ఎలారా భగవంతుడా!

అయిదు నిముషాలు ఆలోచించాను. ఏం తోచలేదు. ఇహ ఆలోచించ లేక పోయాను. చటుక్కున రెండు చేతు ల్తోనూ, ఆమెని నా వైపుకు తిప్పుకుని. గబుక్కున ఆమె కళ్ళపై చుంబించాను

ఉప్పగా పెదాలకు తడి తగిలింది.

'హతోస్మి! ఇంకా దుఃఖిస్తోంది!'

ఈ సారి నాకు నిజంగా జాలి కలి గింది.

'ఇంత బేలా లక్ష్మి? మూడు గంటల ముష్టి సినిమా కోసం. ఉదయం నించీ, ఉత్సాహంగా సెలిబ్రేట్ చేసుకొంటున్న మ్యారేజీ యానివర్సరీ కూడా మర్చి పోయింది. సినిమా నుంచి వచ్చేసి గంట సేపయినా, ఆ సినిమాలోని కష్టాలింకా ఆమెని అకట్టుకొనే వున్నాయా! ఆమె నిజంగా సున్నితమనస్కురాలేనా! నే

నామెవి అర్ధ రహితంగా హేళన చేస్తు న్నానా?'

"ఛ ఇంకా ఏడుస్తున్నావా? పిచ్చి దానా, వూరుకో! అంత బేలగా వున్నా కష్టమే! నిజ జీవితంలో యింకెన్ని కష్టాలొస్తాయో? యివే తట్టుకోలేకపోతే యింక అవెట్లా ఎదుర్కొంటాం?

అలాటి కథల్ని చూస్తే బాధ కల్గటం సహజం కానీ, కొంతసేపటి కయినా మర్చిపోవాలి మరి"

"అలాటి బాధలూ, అనుభవాలూ పగ వాళ్ళకి కూడా వద్దండీ! నాకు కళ్ళు మూసినా, తెరిచినా ఆ హీరోయినే కళ్ళ ముందు మెదుల్తోంది. అంతటి కష్టాలొస్తే ఎవరైనా ఎలా ఎదుర్కోగల రండీ?...."

మళ్ళీ శ్రీమతి కళ్ళనిండా నీళ్ళు. గొంతులో సుళ్ళు తిరుగుతూ తడి!

ఏ రాత్రి వేళకు నిద్ర పట్టిందో ఆమెకు, నాకు తెలీదు!

* * *

ప్రొద్దున పూట కొంచెం ఆలస్యంగా లేవటం అలవాటు నాకు. కానీ, యీవాళ అప్పుడే మెళుకువొచ్చేసింది. దొడ్లో ఎవరిమీదనో అరుస్తున్న శ్రీమతి కేకల్తో.

బద్ధకంగా ఆవులిస్తూ, దొడ్డిపెపు నడిచాను. 'ప్రొద్దున్నే ఎవరిమీదబ్బా. యింతలా గొంతు చించుకుంటోంది' అనుకుంటూ.

పని మనిషి మొగుడు, దొడ్లో నిలబడి వున్నాడు.

"నీ కూతురికి నొప్పులైతే, మీ ఆవిడేం చేస్తోందిరా? నిన్నా వచ్చినప్టి వచ్చి, తగ్గిపోయాయన్నావ్. పన్లోకి రాలేదు. యివాళా అదే పరస! నీ కూతురి పురుడు కాదుగానీ, నా చావు కొచ్చింది రా! ఈ వంకన ఎన్ని రోజులు పనెగ్గొడు తుంది మీ ఆవిడ?"

నోటిని 'బాకా'లా చేసి అరుస్తున్న, ఆమెని చూస్తుంటే ఎలక్షన్ ప్రాపగాండాకి మైక్ లేకుండా పని కొస్తుందని పించింది!

"మీకేం తెల్చునమ్మా దాని బాదలు! రొండ్రోజులయి ఒకటే కష్టపడి పోతా వుంది. పురుడు రానూ గాదు, దాని బాదా పోదు. దానరుపులూ, నొప్పులూ చూస్తా వుంటే, ముద్దగూడా నోట్లోకి పోటం లేదు ఇంక మా యింటిది పన్లు కెట్టా వసద్ది?"

"మరి నా బాధలు చూసే దెవడ్రా? విన్నటికి నిన్న రెండు పూట్లా గిన్నెలు తోముకొనే సరికి చేతులు పడిపోయాయి. మళ్ళీ యివాళానా?

పోనీ, వచ్చినవాడి వెలాగూ వచ్చావు గానీ ఆ నాలుగ్గిన్నెలూ తోమి పడేసి వెళ్ళు"

వాడి ముఖం వడిలిపోయి వుంది. వాడి కళ్ళు బాధతో నిండి, బరువుగా వున్నాయి వాడి గొంతు జాలిగా వుంది. వాడి వైఖరి దయనీయంగా వుంది.

"నాకు రాదమ్మ గిన్నెలు రాసెయ్య టం?"

"వచ్చేదేమిట్రా? రెండు సార్లు చేస్తే అదే వస్తుంది అయినా నీకు గిన్నెల్తో మటం రాకపోవటమేమిటి? అన్నీ వేషాలు...." అదేదో మహాపరాధ

మన్నట్లుంది లక్ష్మి ధోరణి. ఇహ నేను భరించలేక పోయాను

''పోన్లే లక్ష్మి వాళ్ళు బాధల్లో వాళ్ళున్నారు. ఈ రెండ్రోజులూ కాస్త సరుకుంచే....'' నా మాటలు పూర్తి కాక మునుపే గయ్ మంది మావిడ.

''చాల్లే. మీరూరు కోండసలు. మీకేం తెల్సు పీళ్ళ వేషాలు? ఇవాళ కూతురి పురుడనీ, రేపు మనవడి బారసాలనీ. ఆ తర్వాత మరోటీ. యీ వంకన యిదెన్నాళ్ళు ఎగేస్తుందో తెల్సా? కానుపు రాకముందే యీ వరసైతే....''

అవును మరి. అవన్నీ అవసరాలు కావా వాళ్ళకి? యీమాటే బయటి కంటే యింకేమన్నా వుందా. ఏం చేసినా చేయగల్దు ఆవిడ.

ఇహ అక్కడ నుంచోకుండా. గది లోకి వచ్చేశాను. వరండాలో పడివుంది యీనాటి పేపరు.

మొదటి పేజీల్లోనే తాటికాయంత అక్షరాల్లో వుంది. ఏన్నటి సినిమా అద్వర్టయిజ్ మెంట్.

''పేదల కన్నీటి గాథలకు అద్దం పట్టిన కళాఖండం. ప్రేక్షక హృదయాలను ద్రవీభూతం చేసి .... సామూహికంగా ప్రజల్ని ప్రభావితం చేస్తున్న సంచలన చిత్రం....'

ఏం ప్రభావితం చేస్తోందో నా కర్థం కాలేదు. 'ఏడవటం'లో ట్రెయినింగివ్వట మేనా? యింకేమైనా మేలు చేయగల్గుతోందా?

''ఏమోనండీ! ఎవరివైనా కష్టాలు చూస్తే. నా మనసు ద్రవించకుండా వుండదు.'' అంటుందొక వైపు నుంచి మా శ్రీమతి. చీపురు పట్టుకు గెంతులు పెడుతోంది మరోవైపు అపరకాళిలా.

'మనుషులు మారాలి!'

మనుషులెలాగూ మారుతునే వున్నారు. షోకు చేసుకు వెళ్ళిన ముఖాలన్నీ కన్నీటి చారికల్తో. ఉబ్బిన కళ్ళతో రంగులు మారిపోగా, ఎటొచ్చీ వీటన్నిటికీ అతీతంగా, అచంచలంగా వుండిపోతోందల్లా మనసులే!

నిట్టూరుస్తూ 'హెడ్లైన్స్' వైపు దృష్టి సారించాను. •

హౌమాచ్

''ఏమోయ్ మీ నాన్నకు నూరు రూపాయలు అప్పయిచ్చాననుకో! నెలకు పది రూపాయిల చొప్పున నా బాకీ తీరిగి యిస్తే పదినెలల తరువాత బాకీ మిగులు ఎంత వుంటుంది.''

''నూరు రూపాయలు సార్.''

''ఏంటీ లెక్క అర్థంకాలేదా?''

''అయింది సార్ మా నాన్న సంగతే మీకు అర్థంకావటంలేదు.''